సాక్షి యాదాద్రి భువనగిరి

శుక్రవారం । 12 । సెప్టెంబర్ । 2025



అమ్మ పేరుతో మొక్క

తల్లి పేరుతో మొక్క నాటేందుకు కేంద్ర ప్రభుత్వం ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమం చేపట్టింది.

- 8లో



అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్ట్

వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఓ అంతర్ రాష్ట్ర దొంగను దేవరకొండ పోలీసులు అరెస్ట్ చేశారు.

- 8లో



అలంకారప్రాయంగా..

ఆత్మకూరు(ఎం)తోపాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అలంకార ప్రాయంగా మారాయి.

- 9లో

న్యూస్‌రీల్

16న మత్స్యగిరి ఆలయంలో టెండర్లు

వలిగొండ : మండలంలోని వెంకటాపురంలో గల శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వివిధ వస్తువుల సరఫరాకు ఈ నెల 16న టెండర్లు ఆహ్వానిస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి మోహనబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాల్ పోస్టర్ ప్రింటింగ్, తడకల పందిర్లు, ఆర్చీలు వేయుట, టికెట్ పుస్తకాలు, స్టేషనరీ ప్రింటింగ్, ఫ్లెక్సీ బ్యానర్లు, సున్నం రంగులు వేయుట, రోజువారీగా పాలు, పెరుగు, కూరగాయలు, విద్యుత్ పరికరాలు, డెకరేషన్, మైకుసెట్, వివిధ వస్తువుల సరఫరాకు ఏడాది కాలానికి గాను టెండర్లు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు.

గంజాయి బారిన పడకుండా చూడాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

సాక్షి,యాదాద్రి : యువత గంజాయి బారిన పడకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో జిల్లాలో గంజాయి నియంత్రణపై నిర్వహించిన సమావేశంలో జిల్లా అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, ఆర్డీఓ కృష్ణారెడ్డి, జిల్లా మహిళా శిశు సంక్షేమ, విద్యా, వైద్య, పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను తెలిసేలా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి నరసింహారావు, డీఎంహెచ్‌ఓ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గురువారం అందుబాటులో ఉంటా..

భువనగిరిటౌన్ : పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు ప్రజలకు ప్రతి గురువారం అందుబాటులో ఉంటానని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం భువనగిరి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. పలు దరఖాస్తులను స్వీకరించి ఆయా సమస్యలను పరిష్కరించాలని ఫోన్ ద్వారా సదరు అధికారులను ఆదేశించారు.

రెండు కంపెనీల మూసివేతకు ప్రభుత్వం ఉత్తర్వులు

యాదగిరిగుట్ట: మోటకొండూర్ మండలం కాటేపల్లిలో నిర్వహిస్తున్న టైర్ల కంపెనీలైన మహతి ఇండస్ట్రీస్, శ్రీజ ఇండస్ట్రీస్ మూసివేతకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులను జారీచేసింది. కొంత కాలంగా ఈ రెండు కంపెనీల్లో టైర్లు కాల్చి, రీసైక్లింగ్ చేస్తున్నారు. దీంతో వాతావరణం కలుషితమై దుర్వాసన రావడంతో పాటు కంపెనీల నుంచి వచ్చే బూడిదతో పంటలు దెబ్బతింటున్నాయి. ఈ కంపెనీలను తొలగించాలని రైతులు, గ్రామస్తులు ఉద్యమించారు. గ్రామస్తులతో పాటు ఇదే గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ మంత్రి సుభాష్ ప్రభుత్వ ఉన్నతాధికారులకు, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు కంపెనీలపై ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ జరిపించిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు.. మహతి ఇండస్ట్రీ, శ్రీజ ఇండస్ట్రీస్‌లను మూసివేయాలని ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులపై కాటేపల్లి రైతులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. తమ కోసం ఇంగ్లాడ్ నుంచి వచ్చి తమకు అండగా పోరాటం చేసి, కంపెనీలను మూసివేతకు ఉద్యమించిన మంత్రి సుభాష్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

యాదగిరి క్షేత్రంలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అర్చకులు గురువారం సంప్రదాయ పూజలు నిర్వహించారు. వేకువజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు శ్రీస్వామి అమ్మవార్లకు సుప్రభాతం జరిపించారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన వంటి పూజలు చేపట్టారు. ఇక ఆలయ మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజ వాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి కైంకర్యాలను నిర్వహించారు. ముఖ మండపంలో పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు భక్తులచే జరిపించారు.



గజవాహన సేవను ఊరేగిస్తున్న అర్చకులు

రికార్డు స్థాయిలో వర్షం

ముందస్తుగానే జిల్లాకు ఎల్లో హెచ్చరిక జారీ

- కొలనుపాకలో 17 సెంటీమీటర్లు
- మోటకొండూరులో 16 సెం.మీ. నమోదు
- పొంగిన వాగులు, చెరువులు
- వరద ప్రభావంతో రాకపోకలకు అంతరాయం



ఆలేరు రూరల్ : మందపురిలో ఉధృతంగా ప్రవహిస్తున్న పీత్‌వాగును దాటుతున్న రైతులు

సాక్షి, యాదాద్రి : పలు మండలాల్లో గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు రికార్డు స్థాయిలో భారీ వర్షం కురిసింది. అయితే వాతావరణ శాఖ జిల్లాకు ముందస్తుగానే ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఆలేరు మండలం కొలనుపాకలో 173 మిల్లీమీటర్లు (17సెంటీమీటర్ల), మోటకొండూరులో 165 మి.మీ, నందనంలో 97 మి.మీ వర్షం కురిసింది. భారీ వర్షం నేపథ్యంలో అధికారులు అలర్ట్ అయ్యారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జాగ్రత్తలు సూచించారు. ప్రమాదకరంగా ప్రవహించే వాగుల వద్ద రాకపోకలను నియంత్రించారు. ఆలేరు, యాదగిరిగుట్ట, భువనగిరి, మోటకొండూరు మండలాల్లో భారీ వర్షం కురిసింది.

వాహనదారులకు తప్పని ఇబ్బందులు

భువనగిరి : గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కురిసిన భారీ వర్షంతో భువనగిరి-నల్లగొండ రోడ్డులోని నాగిరెడ్డిపల్లి గ్రామం వద్ద కల్వర్టుపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి.



ఆలేరు పట్టణంలోని కుమ్మరివాడ వద్ద ఇళ్ల మధ్య నిలిచిన వర్షపునీరు

ఆలేరులో దంచికొట్టిన వాన

ఆలేరు: ఆలేరులో గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి 7గంటల వరకు ఏకధాటిగా కురిసిన వర్షానికి వాగులు పొంగిపొర్లాయి. పలు వంతెనల వద్ద వరద పోటెత్తింది. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. పెద్దమోరి, తదితర నాలాలు పొంగిపోయాయి. వివిధ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారం నెలకొంది. రత్నాలవాగు బహుదూర్‌పేట, ఈదులవాగు తదితర వంతెనల వద్ద వరద పోటెత్తింది. అప్రమత్తమైన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ సిబ్బందితో ఆయా వంతెనల వద్ద బారికేడ్లను ఏర్పాటు చేయించి రాకపోకలను నిలిపివేశారు. పలు లోతట్టు ప్రాంతాల్లో మోకాళ్ల లోతు వర్షపు నీరు చేరి ముంపునకు గురయ్యాయి.

బాధితులకు సాయమందించండి

- ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

ఆలేరు: భారీ వర్షానికి ఆలేరు పట్టణంలోని బైరవకుంట, ఏంకుంట, పర్రె కాల్వలు అలుగు పోయడంతో కొలనుపాక రోడ్డులో బ్రహ్మంగారి గుడి నుంచి పాత మున్సిపల్ కార్యాలయం, 11, 12 వార్డుల పరిధిలోని రంగనాయకుల వీధి, కుమ్మరివాడ తదితర ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. 30ఇళ్లు నీట మునిగాయి. ఆయా కుటుంబాలను సురక్షిత ప్రాంతానికి తరలించారు. అత్యవసర మాన్‌సూన్ బృందంతో కలిసి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య బోట్‌లో ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. ఇళ్లలోకి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. వారం రోజులపాటు ముంపు బాధితులకు అవసరమైన సరుకులు, ఇతర సహాయం అందించాలని ఎమ్మెల్యే ఫోన్‌లో కలెక్టర్ హనుమంతరావును కోరారు. తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. కొన్ని నాలాలు కబ్జాకు గురై ముంపు సమస్య ఏర్పడిందని, అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.



ఆలేరు పట్టణంలో ఓ ఇంట్లోకి చేరిన వరద నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

ఆలేరు పెద్దవాగు కొద్దిగా పారింది. బస్టాండ్ తోపాటు ప్రధాన రోడ్డు, రైల్వేగేట్ చౌరస్తాలోని ఆర్‌యూబీ వద్ద బురదమయంగా మారింది. జేసీబీతో వరదనీటిని, చెత్తను తొలగింపు పనులు చేపట్టారు.

మోటకొండూర్‌లో..



మోటకొండూర్-సికింద్రానగర్ పెద్దవాగు వద్ద బారికేడ్ పెడుతున్న ఎస్‌ఐ అశోక్, పోలీస్ సిబ్బంది

మోటకొండూర్: మోటకొండూర్ మండల వ్యాప్తంగా గురువారం భారీ వర్షం కురిసింది. మోటకొండూర్, చాడ, చందేపల్లి చెరువులు నిండి అలుగు పారుతున్నాయి. ఆలేరు నుంచి వచ్చే పెద్ద వాగు, బిక్కేరు వాగు, మోటకొండూర్ పెద్ద వాగు, చిన్న వాగులు ప్రవహిస్తుండటంతో పలు చోట్ల రోడ్డు వద్ద వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పోలీసులు ముందస్తు జాగ్రత్తగా బారికేడ్‌లు ఏర్పాటు చేశారు. ముత్తిరెడ్డిగూడెం వద్ద రోడ్డు ఎత్తు ఎక్కువ ఉండడంతో రోడ్డు పక్కన ఉన్న పాత ఇండ్లకు నీళ్లు చేరుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

వర్షపాతం వివరాలు

మండలం	మిల్లీమీటర్లు
మోటకొండూరు	165.3
ఆలేరు	88.1
భువనగిరి	86.2
బొమ్మలరామారం	73.8
నారాయణపూర్	63.0
యాదగిరిగుట్ట	54.5
వలిగొండ	52.7
గుండాల	52.3
చౌటుప్పల్	50.5
తుర్కపల్లి	44.3
పోచంపల్లి	43.5
ఆత్మకూర్-ఎం	40.0
బీబీనగర్	36.3
రాజాపేట	31.4
అడ్డగూడూరు	24.0
రామన్నపేట	19.7



ఆలేరు : పాత మున్సిపల్ కార్యాలయం రోడ్డులో గురువారం రాత్రి మోకాళ్ల లోతు నీటిలో తిరుగుతూ ముంపు సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



భువనగిరిలోని జంఖానగూడెంలో ఇళ్ల మధ్య నిలిచిన వర్షపునీరు

కళాశాలల్లో అడ్మిషన్ల సంఖ్య పెంచాలి

సాక్షి, యాదాద్రి : ప్రభుత్వ ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల సంఖ్య పెరిగేలా చూడడంతోపాటు మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. గురువారం భువనగిరి కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల జీవితంలో ఇంటర్మీడియట్ దశ చాలా కీలకమైనదని, ఇంటర్ విద్యతోనే విద్యార్థుల భవిష్యత్ ముడిపడి ఉందని, ఈ నేపథ్యంలో విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఐఈఓ రమణి, కేజీబీవీ, మోడల్ స్కూల్, కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

భూదానయజ్ఞ బోర్డు పునరుద్ధరణకు కృషి



భూదానోద్యమ పితామహుడు వినోబాభావే, ప్రథమ భూదాత రాంచంద్రారెడ్డి విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి
- పోచంపల్లిలో వినోబాభావే జయంతి వేడుకలు
- హాజరైన ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : భూదానయజ్ఞ బోర్డు పునరుద్ధరణకు కృషిచేస్తామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం భూదాన్ పోచంపల్లిలో వినోబాభావే సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన భూదానోద్యమ పితామహుడు వినోబాభావే 130వ జయంతి ఉత్సవాలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వినోబాభావే, ప్రథమ భూదాత వెదిరె రాంచంద్రారెడ్డి కాంస్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం భూదానబోర్డును రద్దుచేసి ధరణి చట్టాన్ని అడ్డం పెట్టుకొని వందలాది ఎకరాల భూదాన భూములను అన్యాక్రాంతం చేసిందని విమర్శించారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించనున్న భూదానోద్యమ వజ్రోత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తామన్నారు.

చరిత్రపుటల్లో పోచంపల్లి : ఎంపీ చామల

వినోబాభావే, వెదిరె రాంచంద్రారెడ్డిల భూదానోద్యమ స్ఫూర్తితో పోచంపల్లి పేరు చరిత్రపుటల్లో నిలిచిపోయిందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం భూదాన భూముల డేటా లేకుండా చేసి అనేక అక్రమాలకు పాల్పడిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో భూదానబోర్డు మాజీ చైర్మన్ గున్నా రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తడక వెంకటేశ్వర్లు, పాక మల్లేశ్, భారత లవకుమార్, కళ్లెం రాఘవరెడ్డి, సామ మధుసూధన్‌రెడ్డి, తడక రమేశ్, తడక యాదగిరి, అంబరీష్‌రెడ్డి, సీత శ్రీరాములు, కుక్క దానయ్య, కొట్టం కరుణాకర్‌రెడ్డి, గునిగంటి రమేశ్, గునిగంటి వెంకటేశ్, కొయ్యడ శ్రీను, మెరుగు శశికళ, కాసుల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ దరఖాస్తులకే మోక్షం

పరిష్కారం దిశగా సాదాబైనామాలు

- సీసీఎల్‌ఏ నుంచి అందిన ఆదేశాలు
- క్షుణ్ణంగా పరిశీలిస్తున్న అధికారులు
- నిబంధనల మేరకు రెగ్యులరైజేషన్
- వచ్చిన దరఖాస్తులు 15 వేలు
- నోటీసులు ఇచ్చినవి 11,560

సాక్షి, యాదాద్రి : పాత సాదాబైనామాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీంతో వాటి పరిష్కారానికి రెవెన్యూ యంత్రాగం చర్యలు ప్రారంభించింది. ప్రభుత్వం విధివిధానాలను ఖరారు చేయడంతో రైతులకు అడ్డంకులు తొలగనున్నాయి. జిల్లాలోని రైతుల నుంచి 2020లో స్వీకరించిన సాదాబైనామా దరఖాస్తులు 15 వేల వరకు ఉన్నాయి. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు తీసుకున్నప్పటికీ గతంలో ఆన్‌లైన్ దరఖాస్తులకే మోక్షం కలగనుంది.

తహసీల్దార్ లాగిన్‌లోనే దరఖాస్తులు

2014 జూన్ 2కు ముందు తెల్లకాగితాల (సాదాబైనామాల) మీద కొనుగోలు చేసి పూర్తి డబ్బులు చెల్లించిన వారు అర్హులుగా నిర్ణయించారు. అప్పటి ప్రభుత్వం 12.10. 2020 నుంచి 10.11.2020 వరకు దరఖాస్తులను స్వీకరించి వాటిని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసింది. ఈ దరఖాస్తుల్లో అర్హుల వివరాలు ప్రస్తుతం తహసీల్దార్ల లాగిన్‌లోనే ఉన్నాయి. సీసీఎల్‌ఏ నుంచి ఆర్డీఓ లాగిన్‌లోకి రావాల్సి ఉంది.

ఐదు ఎకరాలలోపు ఉంటేనే..

ప్రస్తుతం వచ్చిన దరఖాస్తుల్లో ఐదు ఎకరాల లోపు ఉంటేనే అర్హత ఉంది. రెండున్నర ఎకరాలు, ఐదు ఎకరాల లోపు, ఐదు ఎకరాలపైన ఉన్న దరఖాస్తుల వివరాలను సేకరించారు. సాదా కాగితాల మీద కొనుగోలు చేసి అమ్మిన రైతుకు పూర్తి డబ్బులు చెల్లించి ఉండాలి. అమ్మిన వ్యక్తి చనిపోతే వారి కుటుంబ సభ్యుల నుంచి లీగల్ ఏయిర్ తీసుకోవాలి. క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి భూమి స్వాధీనం చేసిన పత్రాలు ఉండాలి. సాదా కాగితం కొనుగోలు చేసిన భూములు కొన్ని చోట్ల ఇతరులకు అమ్మిన సంఘటనలు ఉన్నాయి. అలాంటి వాటిపై విచారణ జరుపుతున్నాయి. వచ్చిన దరఖాస్తులు గతంలో ఉన్నట్లు గానే భూభారతి సదస్సులో ఇచ్చిన దరఖాస్తులో ఉంటేనే అంగీకరిస్తారు. ఒకవేళ తాజాగా దరఖాస్తు చేసుకోకపోతే పాత దరఖాస్తునే పరిశీలిస్తారు.

మీ సేవలో చేసిన దరఖాస్తులే లెక్క

గతంలో మీసేవ కేంద్రాల్లో చేసిన దరఖాస్తులను భూ భారతిలో ఉన్న రికార్డు ఆధారంగా భూమి అమ్మిన రైతు, కొనుగోలు చేసిన రైతు, గ్రామ పంచాయతీకి నోటీస్‌లు సిద్ధం చేస్తున్నారు. ఒక సర్వే నంబర్‌లో ఎవరి వద్ద భూమి కొనుగోలు చేశాడు, ప్రస్తుతం అతని వద్దే ఉందా లేక చేతులు మారిందా అన్నది పరిశీలిస్తారు. రెవెన్యూ సదస్సులో కొనుగోలు చేసిన వ్యక్తులకు, ప్రస్తుతం అమ్మిన వ్యక్తులకు నోటీసులు ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు.

వివిధ కారణాలతో తొలగింపు

2020లో 15వేల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 11 వేల వరకు అర్హత కలిగివి ఉన్నాయి. ప్రభుత్వ భూములు, అమ్మిన వారు భూమి రికార్డులో లేకపోవడం, సర్వే నంబర్‌లు మ్యాచ్ కాకపోవడం, రెండు అంతకంటే ఎక్కువసార్లు విక్రయించడం, ఇళ్ల స్థలాలకు కేటాయించడం, ఐదెకరాల కంటే ఎక్కువ ఉండడం, రక్తసంబంధీకులకే విక్రయించడం, కోర్టు కేసులు, ఇతర కారణాలతో రిజెక్ట్ అయ్యాయి.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిష్కరిస్తాం

ప్రభుత్వ నిబంధనల మేరకు సాదాబైనామాల రెగ్యులరైజేషన్ చేస్తాం. జిల్లాలో 2020లో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నాం. ఇందు కోసం రెవెన్యూ యంత్రాంగం పనులు ప్రారంభించింది. రెండు మూడు రోజుల్లో చర్యలు వేగం అవుతాయి.

– గోపిరెడ్డి వీరారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్

పత్రికా స్వేచ్ఛపై కత్తికట్టిన ఏపీ ప్రభుత్వం

- సాక్షి పత్రిక, ఎడిటర్‌పై అక్రమ కేసులను ఖండించిన రాజకీయ నేతలు, జర్నలిస్టు సంఘాలు
- భౌతిక దాడులకు దిగడం సరికాదు
- పత్రికా స్వేచ్ఛను కాపాడాలని డిమాండ్

పత్రికా స్వేచ్ఛను హరించేలా ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం చేస్తున్న భౌతిక దాడులను జిల్లాలోని జర్నలిస్టు సంఘాలు, ప్రధాన రాజకీయ పక్షాలు తీవ్రంగా ఖండించాయి. జర్నలిస్టులపై దాడులకు దిగడం ఏ ప్రభుత్వానికి మంచిది కాదని స్పష్టం చేశాయి. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని అక్కడి కూటమి ప్రభుత్వం జర్నలిస్టులపై వ్యవహరిస్తున్న తీరు గర్హనీయమని పేర్కొన్నాయి. పత్రికలు రాసే కథనాలపై అభ్యంతరాలు ఉంటే ఖండించవచ్చని, అంతేతప్ప ప్రత్యక్ష దాడులకు దిగడం సరైంది కాదని తెలిపాయి. అక్కడి ప్రభుత్వం పత్రికల గొంతు నొక్కేలా వ్యవహరిస్తోందని, సాక్షి దిన పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డిపై, రిపోర్టర్లపై కేసులు పెట్టడంపై మండిపడ్డాయి. ప్రభుత్వ ఆదేశాలతో పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడం, నోటీసులు జారీ చేయడం మానుకోవాలని హితవు పలికాయి.

– భువనగిరిటౌన్, యాదగిరిగుట్ట



పత్రికా స్వేచ్ఛను హరించడం దారుణం



ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం, నాయకులు సాక్షి పత్రికపై దాడి చేయడం సరైంది కాదు. ఏదైనా రాజకీయ పరమైన విబేధాలు ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలి కానీ ప్రతికా స్వేచ్ఛను హరించేలా పత్రికా ప్రతినిధులపై దాడి చేయడాన్ని ప్రతిఒక్కరూ ఖండించాలి. సాక్షి పత్రిక ఎడిటర్ ధనంజయ్‌రెడ్డి, బ్యూరో ఇన్‌చార్జ్‌లు, స్థానిక రిపోర్టర్లపై దాడులు చేసి కేసులు బానాయించడం సరైన పద్ధతి కాదు. ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చేందుకు పత్రికలు, విలేకరులు కృషి చేస్తారు. అలాంటి వారిపై దాడులు చేయడం, కేసులు పెట్టడం ఏపీలోని కూటమి ప్రభుత్వానికి తగదు.

– ఎండి జహంగీర్, సీపీఎం జిల్లా కార్యదర్శి

పత్రికలపై ప్రభుత్వాల కక్షసాధింపు చర్యలు పెరుగుతున్నాయి



ప్రభుత్వాలు చేసే అవినీతి, అక్రమాలను ప్రతికలే వెలుగులోకి తెస్తాయి. ప్రభుత్వాలు మారగానే వ్యతిరేకంగా ఉన్న పత్రికలపై కక్షసాధింపు చర్యలు పెరుగుతున్నాయి. అబద్ధాలు రాస్తే కోర్టుల ద్వారా చర్యలు తీసుకోవాలి. పోలీస్ కేసులు బనాయించడం ఆనవాయితీగా మారింది. పత్రికల్లో ఏది వచ్చిన ఎడిటర్ స్థాయి వారిపై కేసులు పెట్టడం సరికాదు. పత్రిక స్వేచ్ఛను కాపాడాలి. సాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసును తీవ్రంగా ఖండిస్తున్నాం.

– కంచర్ల రామకృష్ణారెడ్డి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం..



ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా స్వేచ్ఛ పట్ల రాజకీయ పార్టీలకు గౌరవంగా ఉండాలి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం సాక్షి పత్రికపై అందులో పనిచేసే సిబ్బందిపై దాడులకు దిగడం, పోలీసుల చేత కేసులు పెట్టించడం పత్రికా స్వేచ్ఛను హరించేయడమే. దీనిని టీడబ్ల్యూజేఎఫ్ తీవ్రంగా ఖండిస్తున్నాం. పత్రికలు, పాత్రికేయుల్లో విభిన్న సైదాంతిక భావజాలంతోపాటు వివిధ వర్గాల ప్రజలు ఉంటారు. అధికార బలంతో సాక్షి సిబ్బందిపై పోలీసులు దాడులు చేయడం, నోటీసులు అందజేయడం బాధాకరం.

– వివేకానంద, టీడబ్ల్యూజేఎఫ్, రాష్ట్ర కార్యదర్శి

కేంద్ర ప్రభుత్వం స్పదించాలి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సాక్షి దినపత్రిక, ఎడిటర్, బ్యూరో ఇన్‌చార్జ్, విలేకరులపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నాం. దీనిపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పత్రికా స్వేచ్ఛను భంగం కలిగిస్తున్న దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలి. పత్రిక స్వేచ్ఛపై జరుగుతున్న దాడులను ఉపేక్షించరాదు. దీని వెనుక రాజకీయ నాకులు ఎవరున్నా సరే విచారణ జరిపి శిక్షించాలి.

– సుజావుద్దీన్, మైనారిటీ జర్నలిస్టు ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు

కలంపై కక్షకట్టిన కూటమి ప్రభుత్వం



ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వం అసమర్థతను కలం రూపంలో ప్రజలకు తెలియజేస్తున్న సాక్షి దినపత్రిక, ఎడిటర్ ధనంజయ్‌రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం కక్షకట్టి అక్రమ కేసులు పెట్టడం బాధాకరం. రాజ్యాంగానికి లోబడి ప్రజాస్వామ్యబద్ధగా పాలించాల్సిన బాధ్యతను పక్కన పెట్టి రాష్ట్రాన్ని పోలీస్ రాజ్యంగా చంద్రబాబు ప్రభుత్వం మారుస్తూ ప్రతికా స్వేచ్ఛగా భంగం కలిగిస్తోంది. సాక్షి యాజమాన్యానికి, ఎడిటర్ ధనంజయ్‌రెడ్డికి మేమంతా మద్దతుగా నిలుస్తాం.

– కళ్లెం కృష్ణ, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు

నోటీసులను వెనక్కి తీసుకోవాలి



సాక్షిపైన, సాక్షి ఎడిటర్ ధనంజయ్‌రెడ్డిపైన పెట్టిన కేసులను, ఇచ్చిన నోటీసులను ఏపీలోని కూటమి ప్రభుత్వం కనుసన్నల్లో వ్యవహరిస్తున్న పోలీస్ శాఖ వెనక్కి తీసుకోవాలి. ఏపీలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను ప్రజల గొంతుకగా సాక్షి ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి నోటీసులు ఇవ్వడం శోచనీయం.

– గుండ్లపల్లి శ్రీరామ్‌గౌడ్, టీయూడబ్ల్యూజేహెచ్ 143 రాష్ట్ర నాయకుడు

క్లుప్తంగా

కేసు నమోదు



సీజ్ చేసిన డీజే వాహనం

మోతె : వినాయక నిమజ్జన వేడుకల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా, పోలీసుల అనుమతి లేకుండా డీజే వినియోగించిన నిర్వాహకులపై కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండల పరిధిలోని రావిపహాడ్ గ్రామంలో పోలీసుల అనుమతి లేకుండా సోమవారం రాత్రి వినాయక నిమజ్జన వేడుకల్లో డీజే వినియోగించారు. దీంతో వేడుకల నిర్వాహకుడు పులగుజ్జు కార్తీక్, ఆర్గనైజర్ కోడి మహేష్‌పై కేసు నమోదు చేసి డీజే, వాహనం సీజ్ చేసినట్లు మోతె ఎస్ఐ టి.అజయ్‌కుమార్ గురువారం తెలిపారు.

ఆర్టీసీలో 'యాత్రాదానం'

రామగిరి(నల్లగొండ) : యాత్రాదానం పేరుతో వినూత్న సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆర్టీసీ నల్లగొండ రీజినల్ మేనేజర్ కె.జానిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గిఫ్ట్ ఏ బస్ ట్రావెల్ పథకం కింద కార్పొరేట్ కంపెనీలు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్ఆర్ఐలు సామాజిక బాధ్యతతో వృద్ధులు, దివ్యాంగులకు రవాణా సేవలు అందించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థుల పుట్టిన రోజు వేడుకలు, శుభకార్యాలకు ప్రత్యేక బస్సుల్లో వారిని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లేందుకు ఈ పథకం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. సంస్థకు విరాళాలు అందిస్తే యాత్రాదాన నిధి కింద ప్రత్యేక ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. దాతలు టీజీఎస్ఆర్టీసీ పోర్టల్, క్యూఆర్ కోడ్ యూపీఐ ద్వారా చెల్లించవచ్చని పేర్కొన్నారు.

సిలిండర్లు స్వాధీనం

చౌటుప్పల్ : అక్రమంగా నిల్వ ఉంచిన వంటగ్యాస్ సిలిండర్లను గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. వంటగ్యాస్ సిలిండర్లలోని గ్యాస్‌ను చిన్న సిలిండర్లలోకి నింపి విక్రయిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు పోలీసులు చౌటుప్పల్ పట్టణంలోని రత్నానగర్‌కాలనీలో ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉన్న తడకమళ్ల రామలింగస్వామి మడిగెలో సోదాలు చేశారు. అందులో నిల్వ ఉంచిన 13 సిలిండర్లు, వెయింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ మన్మథకుమార్ తెలిపారు.

ఎరువుల డీలర్లపై కేసు

గుర్రంపోడు : గుర్రంపోడు మండల కేంద్రంలో గురువారం మండల వ్యవసాయ అధికారి కంచర్ల మాధవరెడ్డి తన సిబ్బందితో కలిసి ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో అధిక ధరలకు యూరియా విక్రయించిన ముగ్గురు డీలర్లపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పసుపులేటి మధు తెలిపారు. యూరియా బస్తా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా రూ.266 లకు విక్రయించాల్సి ఉండగా కొంతమంది రైతుల వద్ద రూ.300 తీసుకున్నట్లు విచారణలో తేలింది. దీంతో శరవణ ఫర్టిలైజర్ యజమాని ఎర్ర శ్రీనివాసరావు, శ్రీలక్ష్మీ ఫర్టిలైజర్ యజమాని బొమ్ము ఆనంద్, సాయిరాం ఏజెన్సీ యజమాని చందా గోవింద్ రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసులు నమోదు చేశామని తెలిపారు.

అమ్మ పేరుతో మొక్క

- నాటిన ప్రతి విద్యార్థినికి ప్రశంసాపత్రం
- మొక్కల పెంపకంలో భాగస్వామ్యం
- ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కేంద్ర ప్రభుత్వం



వెంకటాపురం పాఠశాలలో తల్లితో కలిసి మొక్క నాటుతున్న విద్యార్థిని

గుర్రంపోడు : అమ్మ.. మొక్క.. భూమాత.. మూడింటి మధ్య సారుప్యత ఉంటుంది. అమ్మ కుటుంబానికి బాధ్యత వహిస్తే, మొక్కలు పర్యావరణాన్ని కాపాడతాయి. భూమాత జీవ రాశులను, పర్యావరణాన్ని కాపాడుతుంది. ఈ మూడింటికి ముడి పెట్టారు ప్రధాని నరేంద్ర మోదీ. తల్లి పేరుతో మొక్క నాటితే శ్రద్ధ చూపుతారనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఏక్ పేడ్ మాకే నామ్ అనే కార్యక్రమం చేపట్టింది. పర్యావరణ దినోత్సవమైన జూన్ 5, 2024లో ఈ పథకాన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించారు. ప్రతిఒక్కరూ తల్లి పేరుతో మొక్క నాటాలని విస్తృత ప్రచారం చేసి భారీ సంఖ్యలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా చేపట్టారు. ఇటీవల ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినుల భాగస్వాములను చేసి, ప్రతి విద్యార్థి తన తల్లితో కలిసి మొక్కను నాటాలని నిర్దేశించారు. ఏక్ పేడ్ మాకే నామ్ అనే కార్యక్రమం ద్వారా ప్రతి విద్యార్థిని తన తల్లితో కలిసి మొక్కను పాఠశాల ఆవరణలోగాని, పరిసరాల్లోగాని నాటి నాటి ఏకో క్లబ్ మిషన్ లైఫ్ అనే పోర్టల్‌లో ఫొటోను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. విద్యాశాఖ విడుదల చేసిన లింక్‌లో విద్యార్థిని పేరు, తల్లి పేరు, పాఠశాల డైస్ కోడ్ వివరాలు నమోదు చేసి ఫోన్ గ్యాలరీ నుంచి ఫొటోను తీసుకుని అప్‌లోడ్ చేయగానే వారి పేరిట ఆన్‌లైన్‌లోనే ప్రశంసాపత్రం లభిస్తుంది. నాటిన ప్రతి మొక్కకు ప్రశంసాపత్రం లభిస్తుంది. ప్రశంసాపత్రాన్ని వెంటనే స్క్రీన్ షాట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రశంసాపత్రం ఫోన్‌లో డౌన్‌లోడ్‌లోగాని మరెక్కడా కనిపించదు. వెబ్ పోర్టల్‌కు సంబంధించి లింక్‌ను కూడా విద్యాశాఖ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు తెలియజేసింది.

మండలానికి 4 వేల మొక్కల చొప్పున..

ఒక విద్యార్థిని ఎన్ని మొక్కలైనా, ఎక్కడైనా తల్లితో కలిసిగానీ, పాఠశాలలో అయితే మహిళా టీచర్‌తో కలిసి గానీ నాటాలి. జిల్లాకు లక్ష మొక్కలు నాటేలా లక్ష్యం నిర్దేశించగా మండలానికి 4 వేల మొక్కలు నాటి ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ప్రతి పాఠశాలకు 70 ఫొటోలు లక్ష్యం నిర్దేశించారు. వన మహోత్సవ కార్యక్రమం భారీ ఎత్తున నిర్వహిస్తున్నందున ఇందులోనే తల్లిలో కలిసి విద్యార్థిని ఫొటోలు తీయాల్సి ఉంటుంది. నాటిన ప్రతి మొక్కకు విద్యార్థినికి ప్రశంసాపత్రం లభిస్తుండడంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థినులు తమ ఇంటి పరిసరాల్లో మొక్కను నాటి పాఠశాల యూడైస్ కోడ్, ఇతర వివరాలు నమోదు చేసి సొంతంగా అప్‌లోడ్ చేసుకునే అవకాశం కూడా ఉంది. విద్యార్థినులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తున్నారు.

విరివిగా మొక్కలు నాటిస్తాం

విద్యార్థినులు తమ తల్లితో కలిసి మొక్కలు నాటి ఫొటోలు అప్‌లోడ్ చేసేలా అన్ని పాఠశాల హెచ్ఎంలకు దిశానిర్దేశం చేశాం. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటే అవసరాన్ని వివరించి విరివిగా మొక్కలు నాటిస్తాం. గ్రామస్థాయిలో వన నర్సరీల నుంచి మొక్కలు పొంది నాటాలని సూచిస్తున్నాం. పాఠశాలలో సరిపడా స్థలం లేని చోట విద్యార్థిని ఇంటి వద్దగాని, పరిసరాల్లో గాని మొక్కను నాటి సంరక్షించాలని వివరిస్తున్నాం.

–నోముల యాదగిరి, గుర్రంపోడు మండల విద్యాధికారి

డ్రైవర్ సమయస్ఫూర్తితో తప్పిన ప్రమాదం

- బస్సులో 100 మందికి పైగా ప్రయాణికులు
- అందరూ సురక్షితం



రోడ్డు పక్కకు దూసుకుపోయిన బస్సు

సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామ శివారులో కారును తప్పించబోయిన ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ ఆర్టీసీ డిపోనకు చెందిన టీజీ 05 జెడ్ 0045 నంబర్ గల బస్సు గురువారం చండూరు నుంచి జనగాం మీదుగా చౌటుప్పల్‌కు వెళుతోంది. ఈ క్రమంలో జనగాం నుంచి సంస్థాన్ నారాయణపురం వెళ్లే దారిలో కారు ఒకేసారి రోడ్డుపైకి వచ్చింది. కారును తప్పించే క్రమంలో బస్సు రోడ్డు పక్కకు దూసుకుపోయింది. బస్సు టైర్లు, ఇంజన్ భూమిలోకి దిగబడ్డాయి. బస్సు డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డి సమయస్ఫూర్తిగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. ఆ పక్కనే బొంగోల కుంట ఉంది. కొంత అజాగ్రత్తగా వ్యవహరించినట్లయితే బస్సు కుంటలోకి దూసుకెళ్లేది. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 100 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సంఘటన జరిగిన సమయంలో వర్షం కురుస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తర్వాత వచ్చిన బస్సులో ప్రయాణికులను తరలించారు. పోలీసులు అక్కడకు చేరుకుని సంఘటన జరిగిన తీరుపై ఆరా తీస్తున్నారు.

చోరీకి గురైన వినికిడి యంత్రాలు

- రూ.1.50 లక్షల విలువ ఉంటుందన్న బాధితురాలు



తన కుమార్తె వినికిడి యంత్రాలు కలిగిన బాక్స్‌ను ఫోన్‌లో చూపుతున్న తల్లి నాగమణి

చౌటుప్పల్ : కన్న కూతురికి పుట్టుకతో చెవులు వినిపించవు. మాటలు కూడా రావు. ప్రస్తుతం ఐదేళ్ల వయస్సు ఉన్న ఆ చిన్నారి అవస్థలకు తల్లడిల్లిన తల్లిదండ్రులు గతేడాది ఆగస్టులో ఆపరేషన్ చేయించారు. అదేఏడాది అక్టోబర్ నెలలో చెవులకు ప్రత్యేక పరికరాన్ని అమర్చారు. దాంతో వినికిడి సమస్యకు పరిష్కారం దొరికింది. అదేవిధంగా నోటి మాటలను రప్పించేందుకు కూడా పడరానిపాట్లు పడుతున్నారు. స్వగ్రామం నుంచి నిత్యం హైదరాబాద్‌కు కూతురును తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో ఆ చిన్నారికి చెందిన వినికిడి యంత్రాలు బస్సులో చోరీకి గురయ్యాయి. దీంతో వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. మునుగోడు మండలం చీకటిమామిడి గ్రామానికి చెందిన ఏరుకొండ నాగమణి తన కూతురు హాద్వికకు బుధవారం హైదరాబాద్‌లో థెరపీ చేయించి తిరిగి మధ్యాహ్నం 12.40కి దిల్‌సుఖ్‌నగర్ డిపోకు చెందిన బస్సులో చౌటుప్పల్‌కు చేరుకుంది. ఇక్కడి నుంచి నల్లగొండ డిపో బస్సు పల్లెవెలుగు ద్వారా 2.00గంటల ప్రాంతంలో మునుగోడులో దిగింది. అటు నుంచి నేరుగా ఇంటికి వెళ్లి తన వెంట తీసుకెళ్లిన బ్యాగును పక్కన పెట్టింది. మరుసటి రోజు ఉదయం సమయంలో తనకు వినికిడి ఇబ్బంది అవుతోందని కూతురు చెప్పడంతో కూతురు చెవికి ఉన్న పరికరానికి చార్జింగ్ పెట్టేందుకుగాను బ్యాగులో ఉన్న బాక్స్‌ను తెచ్చేందుకు వెళ్లింది. బ్యాగులో బాక్స్ కన్పించకపోవడంతో ఇళ్లంతా వెతికినా ఎక్కడా లభ్యమవ్వలేదు. తాను ప్రయాణం చేసే క్రమంలో బ్యాగు నుంచి ఆ బ్యాక్స్ చోరీకి గురైందని ఆమె ఆలస్యంగా గుర్తించింది. దీంతో రెండు రోజులుగా కనిపించిన వారినందరినీ ఆరా తీస్తోంది. రూ.1.50లక్షల విలువ చేసే వినికిడి పరికరాలు ఎవరికైనా దొరికితే ఇవ్వాలని వేడుకుంటోంది.

అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ.2.5లక్షల నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ మౌనిక

దేవరకొండ: వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఓ అంతర్‌రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి రూ.2.5లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు దేవరకొండ పోలీసులు. ఇందుకు సంబంధించిన వివరాలను దేవరకొండ ఏఎస్పీ మౌనిక గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గానికి చెందిన పిట్ల గంగాధర(అలియాస్) సాంబ 9వ తరగతి వరకు చదువుకున్నాడు. 12 ఏళ్ల క్రితం తండ్రి అనారోగ్యంతో చనిపోవడంతో చదువు మధ్యలో ఆపేసి కూలి పనులు చేస్తూ తల్లితో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో గంగాధర జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్నాడు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడేవాడు. ఈ ఏడాది ఏప్రిల్ 22న దేవరకొండ పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న రాపోతు రమేష్ ఇంట్లో ప్రవేశించి రూ.6 లక్షల నగదు, 2.2 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. చోరీ చేసిన నగదులో సగం డబ్బు దేవరకొండ పట్టణంలోని ఖిలా పార్క్ వద్ద గంగాధర దాచిపెట్టాడు. ఆ నగదును తిరిగి తీసుకునేందుకు గురువారం పట్టణానికి వచ్చిన గంగాధరను పోలీసులు అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో చోరీ చేసిన విషయం ఒప్పుకున్నాడు. కాగా గంగాధరపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లో సుమారు 100 పైచిలుకు దొంగతనం కేసులు నమోదై ఉన్నట్లు ఏఎస్పీ తెలిపారు. సీసీ ఫుటేజీల ఆధారంగా కేసు ఛేదించిన దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి, ఎస్ఐలు నారాయణరెడ్డి, మౌనికలతోపాటు సిబ్బంది సతీష్, అంజయ్య, సింహాద్రిలను ఏఎస్పీ అభినందించారు.

హైవేపై గూడ్స్ లారీ బోల్తా



రోడ్డుపై అడ్డంగా పడిపోయిన లారీ

బీబీనగర్: జాతీయ రహదారిపై బీబీనగర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఓ గూడ్స్ లారీ అదుపు తప్పి బోల్తా పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. గూడ్స్ లారీ భువనగిరి వైపు నుంచి హైదరాబాద్ వెళ్తుండగా పోలీస్‌స్టేషన్ దాటగానే బ్రిడ్జిపై అదుపు తప్పింది. లారీ పల్టీ కొట్టగానే డ్రైవర్ సుక్‌కాంత్ దావ్‌లే లారీలోనుంచి ఎగిరి బ్రిడ్జి కింద వాగులో పడిపోయాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గాయాలపాలైన డ్రైవర్‌ను వాగులో నుంచి బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. లారీ హైవేపై అడ్డంగా పడిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో సర్వీస్ రోడ్డు గుండా వాహనాలను మళ్లించి క్రేన్‌తో లారీని పక్కకు తీయించారు.

చోరీకి గురైన మొబైల్ ఫోన్లు అప్పగింత

- మొబైల్ పోయినా, చోరీకి గురైనా సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి
- సూర్యాపేట ఎస్పీ నరసింహ



ఫోన్లు అప్పగించిన అనంతరం బాధితులు, పోలీసులతో ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్ : మొబైల్ పోయినా, చోరీకి గురైన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు. సూర్యాపేట జిల్లాలో సెల్‌ఫోన్‌లను వివిధ రూపాల్లో పోగొట్టుకున్న 100 మందికి, రికవరీ చేసి గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కె.నరసింహ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరికీ నిత్యావసరమైందని, దీనిని కమ్యూనికేషన్ కోసం, ఆన్‌లైన్ విద్య కోసం వినియోగిస్తున్నామని తెలిపారు. విలువైన సమాచారం, బ్యాంక్ అకౌంట్స్, పాస్ వర్డ్స్, సోషల్ మీడియా అకౌంట్స్, వ్యక్తిగత ఫొటోలు ఫోన్‌లో నిక్షిప్తం చేసుకుంటున్నామన్నారు. మొబైల్ చోరీకి గురైనా, పోగొట్టుకున్నా అందులో ఉన్న సమాచారం పోతుందన్నారు. నేరగాళ్లు మొబైల్ దొంగిలించి, వీక్ పాస్ వర్డ్స్‌లను బ్రేక్ చేసి ఫోన్ పే, గూగుల్ పే తదితర మాధ్యమాల ద్వారా డబ్బులు కాజేస్తున్నారన్నారు. సెల్‌ఫోన్ దొంగతనాల నుంచి విముక్తి కల్పించడానికై డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్‌ను అందుబాటులో తీసుకువచ్చామని తెలిపారు. ఒక్కో మొబైల్ రికవరీ చేయడానికి సైబర్ వారియర్స్ పోలీస్, టెక్నికల్ టీం పోలీసు సిబ్బంది చాలా కృషి చేశారన్నారు. బిహార్, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి మొబైల్స్ ను రికవరీ చేశారని తెలిపారు. కార్యక్రమంలో సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఐటీ కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓకు కోర్టు ధిక్కారం నోటీసులు

మిర్యాలగూడ: దామరచర్ల ఎంపీడీఓ అలివేలు మంగకు గురువారం మిర్యాలగూడ కోర్టు ధిక్కారం నోటీసులు జారీ చేసింది. వివరాలు.. దామరచర్ల మండలంలోని దిలావర్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీనివాసచారి నాలుగేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శ్రీనివాసచారికి సంబంధించిన కుటుంబ సభ్యుల మధ్య వివాదాలు చోటుచేసుకోవడంతో రెండో భార్య కోర్టును ఆశ్రయించింది. ఈక్రమంలో శ్రీనివాసచారి వేతనానికి సంబంధించిన వివరాలు తెలపాలని రెండో భార్య తరఫు న్యాయవాది ఆర్టీఏ ద్వారా దరఖాస్తు అందజేసినా అధికారులు వివరాలు అందించలేదు. అనంతరం కోర్టును ఆశ్రయించి పిటిషన్ వేయడంతో వివరాలు తెలపాలని ఎంపీడీఓకు గత నెల 13వ తేదీన కోర్టు నోటీసులు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించి వివరాలు సమర్పించకపోవడంతో కోర్టు ధిక్కారం కింద ఎంపీడీఓకు అరెస్ట్ వారెంట్ నోటీసులు అందజేసింది. కోర్టు సిబ్బంది దామరచర్ల ఎంపీడీఓ కార్యాలయంలోని ఎంపీడీఓ అలివేలు మంగకు నోటీసులు అందజేసి మిర్యాలగూడ కోర్టుకు తీసుకెళ్లి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. పూర్తి వివరాలతో ఈ నెల 19న కోర్టుకు హాజరు కావాలని ఎంపీడీఓకు ఐదో అదనపు కోర్టు న్యాయమూర్తి వేణు ఆదేశాలు జారీ చేశారు.

తండ్రిపై మమకారం.. వ్యవసాయ క్షేత్రంలో ప్రతిరూపం



అబ్బయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కుమారులు లింగయ్య, రమేష్

ఆత్మకూర్ (ఎస్) : కనిపెంచిన తండ్రి విలువను వారు వదులుకోలేదు. తమ నుంచి తండ్రి దూరమై ఏడాదైనా ఆ జ్ఞాపకాలను అలాగే నెమరవేసుకున్నారు. తండ్రి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని తమ వ్యవసాయ క్షేత్రంలో ఆవిష్కరించుకుని ప్రేమను చాటుకున్నారు ఆ కుమారులు. ఆత్మకూర్ (ఎస్) మండలం గట్టికల్ గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు గుండు అబ్బయ్య ఏడాది క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా తమ తండ్రి జ్ఞాపకార్థం ఆయన కుమారులు గుండు లింగయ్య, గుండు రమేష్.. అబ్బయ్య విగ్రహాన్ని తయారు చేయించారు. గురువారం అబ్బయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా గ్రామంలోని తమ వ్యవసాయ క్షేత్రంలో స్థానిక సీపీఎం నాయకులతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గుండు చిన్న లింగయ్య, రాచకొండ రమేష్, మడ్డి రమేష్, బుర్ర సోమయ్య, దండంపెల్లి కృష్ణయ్య, బైరు వెంకన్న, శంకర్, గుండు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల యూరియా కష్టాలు తీరుస్తాం

- మాజీ మంత్రి జానారెడ్డి



జానారెడ్డికి సమస్యను వివరిస్తున్న రైతులు

నిడమనూరు : కాంగ్రెస్ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు నిడమనూరు మండలంలోని వెనిగండ్ల గ్రామానికి వచ్చిన మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి దృష్టికి పలువురు రైతులు, కాంగ్రెస్ నాయకులు యూరియా కొరత విషయం తీసుకువచ్చారు. మిర్యాలగూడ ర్యాక్ పాయింట్‌కు ఒకటి, రెండు రోజుల్లో యూరియా రానుందని, సాగర్ ఆయకట్టు రైతుల అవసరాలు తీర్చేవిధంగా యూరియా అందించి కష్టాలు తీరుస్తానని ఈ సందర్భంగా జానారెడ్డి వారికి చెప్పారు. వెనిగండ్ల గ్రామ సీలింగ్ భూ వివాదాలు కూడా జానారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఊట్కూరులో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ నాయకుడు విజయ్‌కుమార్.. జానారెడ్డిని కోరారు. ఊట్కూరులో ప్రభుత్వ భూమి 12 ఎకరాలు ఉందని, మరో 8 ఎకరాలు సేకరిస్తే చాలని వివరించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ భూమికోసం సర్వే చేసినట్టు జానారెడ్డికి తహసీల్దారు జంగాల కృష్ణయ్య వివరించారు. వెనిగండ్ల గ్రామానికి చెందిన కొప్పోలు మట్టపల్లి రావు వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులను జానారెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంకతి సత్యం, నర్సింగ్ విజయ్‌కుమార్, ముంగి శివమారయ్య, నందికొండ మట్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న ముగ్గురు మృతి



నాగార్జున(ఫైల్)

భూదాన్‌పోచంపల్లి : వేర్వేరు ఘటనల్లోచికిత్స పొందుతూ ముగ్గురు మృతి చెందారు. వివరాలు ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి మండలం దంతూర్ గ్రామానికి చెందిన రైతు దోటి నాగార్జున (43) ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది బుధవారం తన వ్యవసాయ బావి వద్ద గుళికల మందు తాగాడు. అనంతరం తాను క్రిమిసంహారక మందు తాగానని చిన్న కుమారుడైన శివకు ఫోన్ చేసి చెప్పాడు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు.. ఘటనా స్థలానికి చేరుకుని చూడగా నాగార్జున అపస్మారక స్థితిలో కిందపడి ఉన్నాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. గురువారం మృతుడి పెద్ద కుమారుడు శ్రీనాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె. భాస్కర్‌రెడ్డి తెలిపారు. కాగా మృతుడికి భార్య భాగ్యమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పంచాయతీ కార్మికుడు..



ఏడుకొండలు(ఫైల్)

మఠంపల్లి: మఠంపల్లి మండలంలోని బక్కమంతుల గూడెం గ్రామ పంచాయతీలో తాత్కాలిక పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న బుర్రా ఏడుకొండలు(49) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏడుకొండలు నాలుగురోజుల క్రితం బక్కమంతులగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని త్రివేణినగర్ వద్ద గల వాటర్ ట్యాంకును లోపలి భాగంలో శుభ్రం చేసే క్రమంలో జారిపడ్డాడు. ట్యాంకులో నీరు లేకపోవడంతో తలకు తీవ్ర గాయాలై కోమాలోకి వెళ్లాడు. బంధువులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్యా, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గుర్తుతెలియని మహిళ..



గుర్తు తెలియని మహిళ మృతదేహం

పెద్దఅడిశర్లపల్లి : చికిత్స పొందుతున్న గుర్తు తెలియని మహిళ మృతిచెందిన ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలో చోటుచేసుకుంది. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 6వ తేదీన పెద్దఅడిశర్లపల్లి మండలంలోని నీలంనగర్ సమీపంలో జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై సుమారు 40 సంవత్సరాల వయసు కలిగిన గుర్తు తెలియని మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఆమెను దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతదేహాన్ని గుర్తించినట్లయితే గుడిపల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

వేర్వేరు కేసుల్లో ఆరుగురికి జైలు శిక్ష

గరిడేపల్లి : గరిడేపల్లి మండలంలో 2018వ సంవత్సరంలో జరిగిన దాడి కేసులో నలుగురు నిందితులకు కోర్టు శిక్ష విధించింది. గరిడేపల్లి ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం బాపూజీతండాకు చెందిన కాంతమ్మ, గుగులోతు బాబుపై వ్యక్తిగత విభేదాల కారణంగా.. బాణోతు శివ, గుగులోతు శంకర్, బాలు, చెన్నా కలిసి సీత్లా తండా బ్రిడ్జి వద్ద రోకలి బండలు, క్రికెట్ స్టిక్స్‌తో దాడి చేశారు. ఈ ఘటనలో బాబు తప్పించుకోగా, కాంతమ్మ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందింది. ఈ ఘటనపై గరిడేపల్లి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయింది. పోలీసుల దర్యాప్తు అనంతరం.. సాక్ష్యాధారాలను పరిశీలించి జడ్జి ఎం.రాధాకృష్ణ.. నలుగురు దోషులకు ఒక్కొక్కరికి 5 సంవత్సరాల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో నెలరోజుల సాధారణ శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పు వెల్లడించారు. కేసు విచారణలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిలువేరు వెంకటేశ్వర్లు, కోర్టు కానిస్టేబుళ్లు బొడ్డుపల్లి సైదులు, రాము సహకారం ఉందని ఎస్ఐ నరేష్ తెలిపారు.

దొంగతనం కేసులో ఇద్దరికి..

కట్టంగూర్: కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామంలో ఓ ఇంట్లో జరిగిన దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో మహారాష్ట్ర పార్ధి గ్యాంగ్‌కు చెందిన ఇద్దరికి 18 నెలల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ నకిరేకల్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి షేక్ ఆరిఫ్ గురువారం తీర్పు వెల్లడించారు.. కట్టంగూర్ ఎస్ఐ మునుగోటి రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. అయిటిపాముల గ్రామానికి చెందిన బెల్లి నర్సింహ ఈ ఏడాది జూన్ 15న రాత్రి తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి డాబా పై పడుకున్నాడు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని దొంగలు ఇంట్లో చొరబడి బీరువాలో గల వెండి వస్తువులను దొంగిలించారు. ఈ మేరకు జూన్ 16న బాధితుడు నర్సింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ నన్నెపంగ శ్రీను కేసు నమోదు చేశారు. చిట్యాల సీఐ నాగరాజు ఆధ్వర్యంలో విచారణ జరిపిన పోలీసులు.. మహారాష్ట్రలోని పూణే జిల్లా, ఇందానగర్ పార్ధి గ్యాంగ్‌కు చెందిన అప్పాపాండురంగా పవార్(30), శుభమస్ అశోక్ పవార్(25)లను దొంగతనం కేసులో నిందితులుగా గుర్తించారు. పోలీసులు వారిపై చార్జిషీటు దాఖలు చేసి నకిరేకల్ కోర్టులో హాజరుపరుచగా నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి 18 నెలల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ కె.విజయ వాదించగా, కేసు విచారణకు కట్టంగూర్ ఎస్ఐ ఎం.రవీందర్, పీసీ వెంకన్నలు సహకరించారు.

యువకుడికి 21 ఏళ్ల జైలు శిక్ష

రామగిరి(నల్లగొండ): బాలికకు మాయమాటలు చెప్పి శారీరకంగా లోబర్చుకున్న యువకుడికి 21 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ పోక్సో కోర్టు జడ్జి ఎస్.రోజారమణి గురువారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం దుగినెల్లి గ్రామానికి చెందిన జడిగల హరీష్.. అదే గ్రామానికి చెందిన 16 సంవత్సరాల మైనర్ బాలికను ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పి శారీరకంగా లోబరుచుకున్నాడు. బాలిక కుటుంబ సభ్యులకు విషయం తెలియడంతో పెళ్లి చేసుకోవాలని హరీష్‌ను అతని కుటుంబ సభ్యులను అడిగారు. అయితే, హరీష్ కుటుంబ సభ్యులు ఇల్లు విడిచి పారిపోయారు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు 2018 జులై 21న కట్టంగూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేసి ఛార్జిషీటు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ వాదనలతో ఏకీభవించిన జడ్జి ఎస్.రోజారమణి నిందితుడికి 21 ఏళ్ల జైలు శిక్ష రూ.30 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. బాధిత కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందజేయాలని తీర్పునిచ్చారు. లైజన్ ఆఫీసర్ పి.నరేందర్, ఎన్.మల్లిఖార్జున్, కోర్టు కానిస్టేబుల్ రువ్వ నాగరాజు, భరోసా లీగల్ ఆఫీసర్ ఎం.కల్పన కోర్టుకు సరైన సాక్ష్యాధారాలు సమర్పించి నిందితుడికి కఠిన శిక్ష పడేలా విచారణకు సహకరించారు.